క్లుప్తంగా

సేవాగుణం అలవర్చుకోవాలి

మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేస్తున్న మాజీ ఎంపీపీ, మల్లేష్‌గౌడ్

నందిగామ: ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్ అన్నారు. మండలంలోని చేగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన బంటారం మల్లేశ్‌గౌడ్ తన సొంత డబ్బులతో స్పోర్ట్స్ డ్రెస్‌లు, టై, బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం శివశంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దుస్తులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవితేజ, మధు, యాదగిరి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, నర్సింహా,రాజు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మండలంలోని మొగిలిగిద్ద గ్రామ పంచాయతీ పరిధిలోని రంగదాముల గ్రామంలోని రంగనాయక స్వామి దేవాలయంలో సోమవారం భక్తులు సుదర్శన హోమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఆచార్య సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హోమం, ప్రత్యేక పూజలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పురుషోత్తమచార్యులు, కేశవాచార్యులు, గోపీచార్యులు, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి రమేష్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్తా, యాదయ్య, రాధాకృష్ణ, శ్యాంసుందర్‌రెడ్డి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా మారిన ఎండిన చెట్లు

మొయినాబాద్: మండలంలోని చిలుకూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఆట స్థలంలో ఎండిన చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి కిందే విద్యార్థులు ఆడుకునే పరికరాలు ఉండటంతో ఎండిన చెట్లకొమ్మలు విరిగి పడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఈదురుగాలులు, వర్షానికి తడిసి కొమ్మలు విరిగిపడే ప్రమాదం ఉంది. ఎండిన చెట్లను తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈటలను కలిసిన నేతలు



ఈటలకు చిత్రపటం అందజేస్తున్న నాయకులు

కేశంపేట: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మంగళవారం మండల బీజేపీ సీనియర్ నాయకులు నరసింహ, భక్తవత్సల్, ఆంజనేయులు కలిసి పుష్పగుచ్ఛం, చిత్రపటం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో బీజేపీని ఇంటింటి తీసుకెళ్లాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఈటల రాజేందర్ సూచించినట్లు వారు తెలిపారు.

అభివృద్ధికి నిధులు ఇవ్వండి



రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లకు సంబంధించి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు కేటాయించాలని వివరాలతో కూడిన ప్రతిపాదనలు ముఖ్యమంత్రికి అందించినట్లు ఎమ్మెల్యే వివరించారు. సీఎం సానుకులంగా స్పందించి తప్పకుండా చేదామని చెప్పారని అన్నారు.

'అంగన్‌వాడీ'లో వసతుల కరువు

అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, మౌలిక వసతులు కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. చాలా కేంద్రాలకు సొంత భవనం లేదని ఆరోపిస్తున్నారు.

- సొంత భవనాలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కొత్తూరు మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బయట చదువుకుంటున్న చిన్నారులు

కొత్తూరు: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని చిన్నారులకు విద్యతో పాటు సకాలంలో పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చాలా కేంద్రాల్లో సొంత భవనాలు లేవు. కాగా, ఈ కేంద్రాల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో పలు కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు కనీస వసతులు కరువైయ్యాయి. అధికారులు, ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలు అన్ని వసతులు, సౌకర్యాలతో కొనసాగుతున్నట్లు చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కేంద్రాల్లో చిన్నారులు, సిబ్బందికి తాగునీరు, టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి..

కొత్తూరు మండలంలో మొత్తం 31 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో పెద్ద కేంద్రాలు 27, చిన్న కేంద్రాలు 4. మండలంలో 07 నెలల నుంచి 03 ఏళ్లలోపు 1201 చిన్నారులు, 03-06 ఏళ్ల చిన్నారులు 537 మంది ఉన్నారు. వారిలో 1189 మంది చిన్నారులు కేంద్రాలకు వెళ్తున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. అంతేకాకుండా 269 మంది గర్భిణులు, 228 మంది బాలింతలు ఈ కేంద్రాల పరిధిలో ఉన్నారు.

కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు

మండలంలో 31 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 15 కేంద్రాలకు సొంత భవనాలు లేవు.

- ఆయా గ్రామాల్లోని అదనపు తరగతి గదులు, కమ్యూనిటీ హాళ్లు, డ్వాక్రా భవనాల్లో కేంద్రాలు కొనసాగుతున్నాయి.
- సగానికి పైగా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో లేవు. దీంతో చిన్నారులతో పాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.
- కొన్ని కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు లేవు.
- కొన్ని చోట్ల చిన్న చిన్న గదుల్లో కొనసాగుతున్నాయి. దీంతో వర్షాలు కురిస్తే కేంద్రాలకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.
- ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల గదులు ఇరుకుగా ఉండడంతో చిన్నారులను ఆడించడానికి స్థలం కరువైంది.
- ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పలు ఆట వస్తువులు, క్రీడా సామగ్రిను అందిస్తోంది. కాగా, స్థలాభావం కారణంగా కొన్ని కేంద్రాల్లో ఆట వస్తువులను మూలన పెట్టాల్సి వస్తుంది.

సౌకర్యాల లేమితో చిన్నారులకు అందని సేవలు

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అనుకున్న లక్ష్యాలను రాబట్టడం లేదు. కేంద్రాల నిర్వహణకు ఏటా రూ.కోట్ల ఖర్చు చేస్తున్నప్పటికీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, వసతులు కరువైయ్యాయి. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అన్ని సేవలు అందడం లేదు.

సొంత భవనాలు లేవు



మండలంలో 15 కేంద్రాలకు సొంత భవనాలు లేవు. పలు కేంద్రాలకు విద్యుత్ సరఫరా లేదు. కొన్ని గ్రామాల్లో కొనసాగుతున్న కేంద్రాలు సక్రమంగా లేని కారణంగా చిన్నారులకు ఒకేసారి చదువు, ఆటలు ఆడించడానికి కుదరడం లేదు.

– జ్యోతి, ఐసీడీఎస్, సూపర్‌వైజర్, కొత్తూరు

రైతు సంక్షేమమే సర్కార్ లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆగిర్యాలలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొందుర్గు: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఆగిర్యాల, పాత ఆగిర్యాల గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆగిర్యాల సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. అలాగే, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డితో కలిసి గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం, స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. అలాగే, పాత ఆగిర్యాలలో గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడం కోసం ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం విద్యుత్ సబ్‌స్టేషన్లలో కాలం చెల్లిన కరెంటు తీగలు, తుప్పుపట్టిన పరికరాలు ఉన్నాయని అధికారులు గమనించి ఎప్పటికప్పుడు ప్రణాళికలు సిద్ధం చేసి నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, బార్‌ఖాన్, మల్లేష్ గౌడ్, సయ్యద్ సాదిక్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

షాద్‌నగర్‌రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. పట్టణ సీఐగా బాధ్యతలను చేపట్టిన సీఐ విజయకుమార్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో పట్టణంతో పాటుగా శివారు కాలనీల్లో పోలీసుల గస్తీని ఏర్పాటు చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

షాద్‌నగర్‌రూరల్: సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అంటు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిల్లో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



విద్యార్థులతో నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

షాద్‌నగర్: ప్రభుత్వ వసతి గృహాలు, విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఐదు వందల మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సరిపడా డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాలలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సిబ్బంది, విద్యార్థులు కోరారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వ వసతి గృహాలు, కేజీబీవీ పాఠశాలలకు వస్తుంటారని అన్నారు. వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసురావాలని తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలి

ఎంపీడీఓ సంధ్య



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

మొయినాబాద్: గ్రామాల్లోని పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని ఎంపీడీఓ సంధ్య అన్నారు. అమ్మమాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం చిలుకూరు, మొయినాబాద్ గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు, బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తారని... ఆటపాటలతో పాటు చదువు నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రవిత, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు అనసూయ, భవిష్యవాణి, ఆయా ప్రణీత, సిబ్బంది సాయిబాబా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేస్తున్నఅంగన్‌వాడీలు

షాద్‌నగర్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు ఆసరా పెన్షన్ ఇవ్వాలన్నారు. పదవీ విరమణ పొందిన వారికి వీఆర్ఎస్ వర్తింపజేస్తామని గత ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగిందన్నారు. నేటికి ఆ హామీ నెరవేరలేదన్నారు. అదేవిధంగా సమ్మె కాలపు వేతనాలు, ప్రమాద బీమా, టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. పాత జీఓను తీసుకుచ్చి తక్కువ జీతం చెల్లించి వారితో పదవీ విరమణ చేయించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వాపోయారు. హెల్పర్లకు పదవ తరగతి విద్యార్హత ప్రకారం వచ్చే ప్రమోషన్లను రద్దు చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్, శ్రీనివాస్, జయమ్మ, ఊర్మిళ, సంగీత, సుజాత, మమత, హేమలత, వీణ, అనసూయ, శోభారాణి, జ్యోతి, నర్సమ్మ, జయమ్మ, శ్రీదేవి, ఇందిర, ఉమ, రాజ్యలక్ష్మీ, తులసీ, వినోద, సంతోష, భాగ్యలక్ష్మీ, అరుణ పాల్గొన్నారు.

ఇది కాలువ కాదు.. రోడ్డే!



కాలువను తలపిస్తున్న మొయినాబాద్-చిలుకూరు రోడ్డు

మొయినాబాద్: ఈ ఫొటోను చూస్తుంటే ఏదో కాలువలో నీళ్లు పారుతున్నట్లు కనిపిస్తుంది కదూ. కానీ ఇది కాలువ కాదు. మొయినాబాద్ నుంచి చిలుకూరు వెళ్లే రోడ్డు. నమ్మలేకపోతున్నారా... ఇది నిజంగా రోడ్డే. చిలుకూరు నుంచి మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు రోడ్డు అభివృద్ధికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు కొంత దూరం రోడ్డు వేశారు. మొయినాబాద్ నుంచి చిలుకూరు వరకు రోడ్డుకు ఇరుపక్కల ఎత్తుగా మట్టి పోసి మధ్యలో కంకర పోసి వదిలేశారు. వర్షం పడినప్పుడల్లా రోడ్డుపై నీళ్లు నిలిచి ఇలా కాలువలా మరుతుంది. రోడ్డుపై నీళ్లు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మైనింగ్‌తో ప్రజల భవిష్యత్ అంధకారం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల: మండలంలోని అంతారం గ్రామంలో మైనింగ్ తవ్వకాల వల్ల ప్రజల భవిష్యత్ అంధకారమవుతుందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. మహేందర్ అన్నారు. తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ సోమవారం ఏఐకేఎంఎస్ నాయకులు ఆర్డీఓ సాయిరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మైనింగ్ వల్ల నేల కాలుష్యం ఏర్పడి కలరా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సహజ సిద్ధంగా ప్రకృతితో కలిసి ఉన్న 100 ఎకరాల గుట్టను మైనింగ్ పేరుతో నేలమట్టం చేశారన్నారు. మైనింగ్ తవ్వకాల వల్ల ఈ ప్రాంతంలో లోతైన గుంతలు ఏర్పడ్డాయన్నారు. ఇక్కడ మైనింగ్ అనుమతులు వద్దని గ్రామస్తులంతా తీర్మానిస్తున్నారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని, కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు శ్రీకాంత్, రాజేశ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర

షాద్‌నగర్: జగన్నాథ రథయాత్రను సోమవారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌టీసీ కాలనీలోని జగన్నాథ స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పట్టణంలోని పురవీధుల గుండా రథయాత్రను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, ఈశ్వర్ రాజు, సుధీర్, జూపల్లి శంకర్, మల్చలం మురళీ పాల్గొన్నారు.

నూతన నియామకం



నూతన కమిటీ సభ్యులు

షాద్‌నగర్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా నూతన అధ్యక్షుడిగా షాద్‌నగర్‌కు చెందిన ఆశన్నగారి భుజంగరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సంఘం జిల్లా మూడవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆశన్నగారి భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షుడిగా శేఖర్, కోశాధికారులు నాగార్జున, శ్రీనివాస్‌చారి, సహాయ కార్యదర్శిగా సంతోషలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేసి, సన్మానించారు.

నవీష్‌కు అభినందనలు



షాబాద్: జిల్లా అండర్‌- 7 స్కేటింగ్ కాంపిటిషన్‌లో మొదటి స్థానంలో విజయం సాధించిన నవీష్‌ను స్కేటింగ్ కోచ్ శంకర్ అభినందించారు. కూకట్‌పల్లిలోని బౌరంపేట్ స్కేటింగ్ అకాడమీ గ్రౌండ్‌లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. పోటీల్లో రంగారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన వివిధ స్కేటింగ్ సెంటర్ల నుంచి పోటీల్లో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు మల్లేశ్ కుమారుడు నవీష్ స్కేటింగ్‌లో ప్రథమ స్థానంలో విజయం సాధించారు. ఈ సందర్భంగా కోచ్ శంకర్ అతడిని అభినందించారు.

గోరింటాకు సంబరాలు

చేవెళ్ల: మండలంలోని తాళ్లపల్లి గ్రామంలోని పాదుపు సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. సోమవారం మహిళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఆషాఢ మాసం గోరింటాకు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు చేతులకు గోరింటాకు వేసుకొని ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా వేడుకలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు ఉమారాణి, సభ్యులు పార్వతమ్మ, మంజుల, భావన, స్వరూజ, మధున పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి విద్యార్థినుల అర్హత

చేవెళ్ల: ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించి జాతీయ ఉపకార వేతనానికి నలుగురు విద్యార్థినిలు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీవాత్స్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. షాబాద్ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న ఎస్.సృజన హన్సిక 960, ఎం.సంజన 944, పి.సిరి 933, కె.గీతాంజలి 924 మార్కులు సాధించి కేంద్ర విద్యాశాఖ నుంచి ఉపకార వేతనానికి అర్హత సాధించినట్లు తెలిపారు. వీరికి ఒక్కొక్కరి డిగ్రీకి పది వేల చొప్పున మూడు సంవత్సరాల పాటు 30 వేలు పీజీలో సంవత్సరానికి పది వేల చొప్పున రెండు సంవత్సరాలకు 20 వేలు, మొత్తం ఒకొక్కకరికి 70 వేల కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు సన్మానించారు.

విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అన్వేష్‌రెడ్డిని సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో అన్వేష్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి షాద్‌నగర్ నుంచి కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లారు. నాయకులు చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌గౌడ్, దేవగిరి రాజు, సురేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, గణేష్‌యాదవ్, మల్లేష్‌గౌడ్, చందుయాదవ్ పాల్గొన్నారు.

మా ఊరికి బస్సులు నడపండి



డిపో మేనేజర్ మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: మా ఊరికి ఆర్టీసీ బస్సులు నడపాలని శ్రీరాంనగర్ గ్రామస్తులు మెహదీపట్నం డిపో మేనేజర్ మూర్తికి విన్నవించారు. సోమవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, నాయకులు రాజేందర్‌గౌడ్, భరత్ తదితరులు నగరంలోని మెహదీపట్నం డిపో మేనేజర్ మూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి వచ్చే ఆర్టీసీ సర్వీసులను పూర్తిగా ఆపేశారని.. ఆ సర్వీసులను పునరుద్ధరించి అదనపు ట్రిప్పులు నడపాలని మేనేజర్‌ను కోరారు. బస్సులు రాకపోవడం వల్ల విద్యార్థులు, రైతులు, పనులకు వెళ్లేవారు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రోడ్లు బాగోలేకపోవడం వల్లే బస్సులు నడపడం లేదని.. రోడ్లు బాగుచేసిన తరువాత బస్సులు నడుపుతామని మేనేజర్ మూర్తి వారికి వివరించారు.

గురువులు సమాజ నిర్మాతలు

మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్



ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామస్తులు

కొందుర్గు: గురువులు సమాజ నిర్మాతలని మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన 18 మంది ఉపాధ్యాయులను సోమవారం శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజేష్ పటేల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే గురువు దైవంతో సమానమన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం గోపిచంద్, విశ్రాంత ఉపాధ్యాయులు గంగిరెడ్డి, గ్రామస్తులు సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెదడువాపు నిరోధక వ్యాక్సిన్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న అక్బర్

చేవెళ్ల: మెదడు వాపు వ్యాధి నుంచి పిల్లలను రక్షించుకోవటానికి వేసే వ్యాక్సిన్‌ను పిల్లలకు తప్పనిసరిగా వేయించాల్సి ఉంటుందని మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్, ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రఘుబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మెదడు వాపు వ్యాధి నివారణకు 9నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలందరికీ వ్యాక్సిన్ తప్పనిసరిగా ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు దశాలవారీగా వ్యాక్సిన్‌ను ప్రతి పిల్లవాడికి రెండుసార్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు వేసేందుకు రాష్ట్రంలోనే ఈ నాలుగు జిల్లాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నిర్వహించబోతుందని చెప్పారు. వ్యాక్సిన్‌పై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంటుందని చెప్పారు. అలాగే, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు ప్రవళిక, అనూషలు మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించటం వల్ల అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు నోడల్ ఉపాధ్యాయుడిగా ఉంటూ పరిశుభ్రతపై విద్యార్థులందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.